ప్రతి పోలీసాఫీసరులో ఇంత లోతుగా విశ్లేషించగల శక్తే వుంటే ఎంత బాగుణ్ణు అన్న ఆలోచనో లేక ఒక విధిగా కాక నిజాయితీగా నిర్వ ర్తించాల్సిన ధర్మంకోసం యశస్వి పడుతున్న తపనపై అభిమానమో అతడ్ని సమీపించి ప్రేమగా భుజంపై తట్టాడు రఘునాధరావు "ఐ విల్ సర్టెన్లీ స్పీక్ టు పబ్లిక్ ప్రాసిక్యూటర్.. కాని నిజాన్ని ఈ పద్ధతిలో రాబట్టగలమన్న నమ్మకం నీకుందా?".

"సర్-" అటెన్షన్‌లో నిలబడే అన్నాడు "ప్రతి ప్రాణీ తన పరిసరాలోని మార్పులకి అనుగుణంగా తనను తాను సంస్కరించుకోవాలి. మార్పు చెందాలి. లేనివాడు ఆ ప్రదేశం నశించిపోతుంది....ఈ సృష్టిలో పరిణామానికి ముఖ్య కారణం జీవితేచ్ఛ.
దాన్ని నాశనం చేసే హక్కు మరో ప్రాణికి ఉండకూడదన్న ప్రాతిపదికపైనే ఇంతటి క్రియేటివ్ ఎవల్యూషన్ జరిగింది కూడా- ఆనాటి ఆటవిక వ్యవస్థ నుంచి ఇంతవరకూ మనం ఎదిగేక కూడా ఇంకా సాటి మనిషిని ముఖ్యంగా నిస్సహాయురాలైన ఓ ఇంటి కోడల్ని అంతం చేయడమన్నది ఇప్పుడొక సాంప్రదాయంగా మారిందీ అంటే అది మన సంఘానికి పుట్టిన ఓ రాచపుండు....

దాన్ని వీలైనంత వరకూ సమూలంగా సర్జరీచేస్తే తప్ప ఈ బార్బేరియన్ ఏక్ట్స్‌కి అంతముండదు. పావని అనే ఓ యువతి నాకు తోబుట్టువు కాదు-కాని ఈ సంఘంలో నాలాగే పుట్టి మనుషులమధ్య బ్రతకాలనుకున్నది- " ఎమోషనల్ గా జవాబిచ్చిన యశస్వి ఓ లిప్తపాటు తాను అవసరానికి మించి మాట్లాడినట్టు అర్థంచేసుకుని తల వంచుకున్నాడు.

"హాట్ బ్లడ్" అనుకున్నాడు నవ్వుకుంటూ "ప్రొసీడ్ " అంటూ కరచాలనం చేశాడు.

---

వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ కభిముఖంగా ఓ మారుతికారు ఆగింది.

అందులోనుంచి దిగిన పద్దెనిమిదేళ్ళ హరిత సహజంగా ఓ వయసులో వున్న ఆడపిల్ల పోలీస్‌స్టేషన్‌లో అడుగు పెట్టేటప్పుడు ఎంత అణుకువనీ భయాన్నీ ప్రదర్శిస్తుందో అలా రాలేదు.

హఠాత్తుగా ఇన్‌స్పెక్షన్‌కి వచ్చిన లేడి కమీషనర్‌లా లోపలికి దూసుకొచ్చి యస్సై కుర్చీలో కూర్చుని గట్టిగా బెల్ కొట్టింది.

ఎప్పుడు జేబులు కొట్టేవాళ్ళు అప్పుడప్పుడూ వాళ్ళని విడిపించాలని వచ్చే రాజకీయనాయకుల్నీ తప్ప అలాంటి అందమైన అమ్మాయి స్టేషన్‌లో అడుగుపెట్టడం తెలీని కానిస్టేబుల్స్ అప్పటికే తేరుకొన్నారు.

తేరుకున్నాక దూకుడుగా ముందుకొచ్చాడు హెడ్ కానిస్టేబుల్ గుర్నాధం.

"ఎక్కడ మీ ఇన్‌చార్జి" సీరియస్‌గా అడిగింది.

"బాబులకేటి బోలెడు పనులుంటాయిగాని తమరెవరు తల్లీ" అన్నాడు.

"తల్లీ" హరిత భృకుటి ముడిపడింది "నేను నీకు పిల్లల తల్లిలా కనిపిస్తున్నానా.... ఇలా తల్లీ అన్న నేరానికి నిన్ను డిఫమేషన్ కేసులో వేసి లోపల వేయించేగల్ను."

"అది కాదమ్మా" వినయంగా సర్ది చెప్పబోయాడు.

"అమ్మా" కోపాన్ని ప్రదర్శిస్తూ "నేను అమ్మలా కనిపిస్తున్నానా" అంది వణికిపోతున్న భారీకాయాన్ని చూస్తూ.

"అదికాదండీ...ఆ" గుర్తుకొచ్చింది "మేడమ్" అన్నాడు.

"దట్స్‌గుడ్ - పర్వాలేదు - ఆలస్యంగానైనా నీ బుర్ర పనిచేసింది."

"ఏంటి మేడమ్.... తమరికొద్దిన కష్టమేటి" మారుతీ కారులో వచ్చినవాళ్ళ కష్టాలు తీర్చకపోతే తను ఉనిక్కి అర్థం లేనట్టు చాలా విధేయతతో అడిగాడు.

"మరేం లేదు-ఓ అబ్బాయ్ కనిపించటం లేదు."

"హన్నన్నా...తమరి- అబ్బాయేనా" అనబోయి ఆ తర్వాత అది మరే ఉపద్రవానికి దారితీస్తుందో అన్న సందేహంతో "అదేనండీ - తమరికేమవుతాడండి-అబ్బాయి గోరు-" అన్నాడు.

"చెప్పను. అసలు నీకు చెప్పాల్సిన అగత్యం నాకు లేదు. ఎందుకో తెలుసా."

"తెలీదండీ."

"పోనీ బెర్నార్డ్ షా నీకు తెలుసా?"

కొద్దిగా ఆలోచనలో పడ్డాడు హెచ్.సి. ఈ మధ్యకాలంలో అలాంటి పేరుగల క్రిమినలెవరైనా స్టేషనుకొచ్చాడా అని గుర్తు చేసుకొంటూ "చూసి నట్టు గుర్తులేదండి" అనేశాడు.

"అందుకే అన్నాడు."

"ఎవరండి?"

"బెర్నార్డ్ షా"

"ఏమన్నాడండీ?"

"కామన్ సెన్స్ యీజ్ వెరీ అన్ కామన్"

"ఎందుకన్నాడండి"

"మీలాంటి పోలీసుల్ని చూసి."

"అయితే" స్ఫురించేసింది హెచ్.సికి "ఆ పెద్దమనిషా అమ్మా యిప్పుడు తప్పిపోయింది"

"మరేం."

"అయితే కంప్లైయింటిచ్చేయండి."

"పత్రా కాగితం" సాధికారంగా అడిగేసరికి ఇలా ఆదేశాలు జారీ చేయడం నచ్చకపోయినా బహుశా ఆ బెర్నార్డ్ షా ఏ ఎస్పీగారికో బంధువో అయితే ఆనక బోలెడన్ని చిక్కులొచ్చే అవకాశముందని కాగితం పెన్ను అందించేశాడు.

రెండు నిముషాలలో చకచకా రాసేసి కాగితాన్ని టేబుల్ పై వుంచి "మీ యస్సై పేరేంటన్నావు" అంది.

"ఇంకా నేనేం అనలేదుగాని ఇప్పుడంటానండి. యశస్విగారని- మా చెడ్డ మనిషండి-యిప్పుడు తప్పిపోయిన అబ్బాయిని మరో గంటకల్లా పట్టిస్తారండి.... ఆయనేమో మరోగంటకల్లా వస్తారండి - మరింకేమన్నా చెప్పమంటారాండీ-"

"చెప్పకు-" లేచింది "ఈ కంప్లయింట్ని ఆయనకి అందచెయ్యి"

"అలాగేనండీ"

"అండీ అంటే కుదరదు. కంప్లయింట్ చదివి వెంటనే రంగంలోకి దిగేయ్యమను- లేకపోతే - " ఆగి "పాడేరెప్పుడైనా చూశావా" అంది.

"హమ్మో - తెలీకపోడమేంటండి- అడవి ప్రాంతమండీ. పైగా అక్కడ పులులూ ఎలుగ్గొడ్లూ ఎక్కువండీ" అన్నాడు.

"అదిగో... అక్కడికి ట్రాన్స్ఫర్ చేయించేస్తానని చెప్పు."

హరిత చకచకా వెళ్ళి మరో రెండు నిముషాలలో కోపంగా మారుతిలో కూర్చున్నాక గుర్నాధం అనుకున్నాడు "పెద్దింటి బిడ్డలాగుంది కాబట్టి పోయిన అబ్బాయిని పట్టుకోగల్గితే తప్ప పాడేరు తప్పదని".

మరో అయిదు నిముషాలలో బుల్లెట్ పై స్టేషన్కొచ్చిన యశస్వి తన సీటులో కూర్చుని రేక్లోని పావని మరణానికి సంబంధించిన ఫైలు అందుకుని F I R ని చూస్తున్నాడు.

తన ఇన్వెస్టిగేషన్ ఎక్కడ నుంచి ప్రారంభించాలో అప్పటికే ఓ నిర్ణయానికి వచ్చేశాడు.

మరో పది నిముషాలలో తుంపాల గ్రామానికి వెళ్ళాలి.

దోషులనబడే వ్యక్తుల్ని కలియకుండా నానీని కలిసి మరి కొన్ని వివరాల్ని సేకరించాలి.

"అయ్యా" హెచ్. సి. పిలిచేసరికి ఫైల్లో నుంచి తలెత్తకుండానే "ఊ" అన్నాడు.

యశస్వి అలా ఊకొట్టడంలోని సీరియస్నెస్ కి గుర్నాధం ఎంత కంగారు పడ్డాడు అంటే అసలు సంగతి మరచిపోయి "పాడేరండి.... మరీ బేడ్ ప్లేస్ బాబు" అన్నాడు తొట్రుపాటుగా.

"ఏం ....ట్రాన్స్ఫరార్డర్స్ వచ్చాయా?" అడిగాడు ఫైలులోకి చూస్తూనే.

"అయ్యా....వచ్చేట్టున్నాయండి."

"ఎవరికి?"

"తమరికే"

కోపంగా తలెత్తాడు..... ఇలాంటి సమయంలో డిపార్టుమెంట్లో పేరుకుపోయిన వేలాదిమంది వెర్రి వెంగళాయిల్లో ఒకడయిన గుర్నాధం తన సహనాన్ని పరీక్షించడం అతనికి నచ్చలేదు.

“వాట్ డు యూ మీన్.”

“అయ్యా.... కోపమొద్దండీ.... ఒక అమ్మాయిగోరండి.... కారులో వచ్చారండి.... అయినా అది మనకెందుకండి....వచ్చేక తమరిని అడిగా రండీ... మనకెందుకులే అని వూరుకోంగదండీ.... వస్తారని చెప్పానండి.... వెంటనే ఓ అబ్బాయి తప్పిపోయాడు అనేసి రిపోర్టు రాశారండి.... అమ్మా యైతే గొప్పింటిబిడ్డలా బాగున్నారండి.... అయితేమాత్రం అవన్నీ మనకెందుకండీ.... అందుకే కాగితం పెన్నూ చేతికందించానండి.... రాసేశాక వెంటనే అబ్బాయి ఆచూకీ తెలియపరచకపోతే పాడేరులాటి చోటికి ట్రాన్స్ఫర్ల గొడవలు జరిగిపోతాయం దండీ...ఆయన్నీ మనకెందుకులే అని వూరుకోలేంకదండీ నేను మీకు చెప్పానండి” అన్నాడు రిపోర్టుని అందిస్తూ.

సాలోచనగా పేపర్‌లోకి చూసాడు యశస్వి.

“ఎత్తు ఆరడుగులుంటాడు.... స్ఫురద్రూపి తెలుగు నవల్లోలా.... చెప్పా చెయకుండా కలలోకి వచ్చి అదీ నా పర్మిషన్ లేకుండా నానా రకాలుగా నన్ను బాధపెట్టి ఇంకా ముద్దులవి పెట్టి చట్టానికి అప్పచెబుతా
మనుకుంటుండగా తప్పించుకు పోయాడు.... నాకు గుర్తున్నంతవరకూ నా శీలం కాపాడుకున్నాననే అనుకుంటున్నాను.... ఎలాగయినా అతన్ని అదే ఇరవై నాలుగు గంటలుగా కలలోకి రాకుండా తప్పించుకు తిరుగుతున్న ఆ పెద్దమషిని పట్టుకోమని ఆదేశిస్తున్నాను” ఇంగ్లీష్‌లో రాయబడిన ఆ వాక్యాలు చూస్తూ క్రమంగా ముఖం వివర్ణం కాగా  కాగితాన్ని చింపేయబోతూ ఠక్కున ఆగేడు చివరి వాక్యాన్ని చూసి

‘ఇంతకి ఆ కనిపించని పెద్దమనిషి పేరు చెప్పనేలేదు కదూ.... ఎప్పుడు డ్యూటీ అంటూ ఇలాంటి బ్యూటీకి దూరమయ్యే యశస్వి అనే పోలీస్ ఆఫీసర్.’

అంత టెన్షన్‌లోనూ యశస్వి పెదవులు విచ్చుకున్నాయి.

నిజమే.

హరితని కలిసి ఇరవై నాలుగు గంటలు దాటిపోయింది.

షుగర్ ఫ్యాక్టరీ చైర్మన్ కూతురయిన హరిత యశస్వికి పరిచయమైంది సుమారు నాలుగు నెలల క్రితమే అయినా ఈ నాల్లు నెలల్లోనూ ఎంత దగ్గరయిందీ అంటే నేరస్తులూ నేరాలమధ్య తలమునకలయ్యే అతనికి పెద్ద రిలీఫ్....

మనిషి మాత్రమే కాదు మాటలూ అంతకుమించి మొండితనంతో యశస్విలాటి టఫ్ పోలీసాఫీసరునే కంగారుపెడుతూ వుంటుంది.

“కానిస్టేబుల్‌ని పంపమంటారా సర్” అన్నాడు గుర్నాధం వినయంగా.

“దేనికి?”

“ఆ పెద్దమనిషిని అదే ఆ కనిపించనాయన్ని వెదికించడానికండి” సిన్సియర్‌గా జవాబిచ్చేసరికి “నేను చూసుకుంటాను” అనేసి వెళ్ళమన్నట్టుగా సంజ్ఞ చేశాడు.

ఫోన్ రిసీవర్ని అందుకుని డయల్ చేశాడు.

"హల్లో" హరిత అందుకుంది.

"ఎవరూ?"

"నేనే మిస్సింగ్ బోయ్ యశస్విని" వెంటనే అవతలి వైపునుంచి జవాబు రాకపోయేసరికి "కోపంగా వుందా" అన్నాడు.

"ఉండక.... సంతోషంగా వుంటుందా.... చూడు మిష్టర్ మిస్సింగ్ పెద్దమనిషి... నిజం చెప్పని క్రిమినల్స్‌ని మీరు థర్డ్ డిగ్రీ ట్రీట్‌మెంట్‌తో పనిష్ చేస్తారు కదూ...."

"అఫ్‌కోర్స్"

"మరి నిన్న సాయంకాలం కలుస్తానని అబద్ధం చెప్పిన నీకు నేనేం పనిష్‌మెంట్ ఇవ్వాలి. అది చెప్పు."

"నేనెక్కడ మాట తప్పాను?"

"మరొక అబద్ధమా"

"అదికాదు- నీ కంప్లయింట్ ప్రకారం కలలోకొచ్చి నానా అల్లరి చేస్తున్నానుగా...."

"ఛీ.... రాయటానికి నాకు సిగ్గులేదు సరే.... అడగటానికి నీకన్నా వుండాలి"

"అవునూ.... ముద్దులు పెట్టానన్నావు.... ఆ ఏరియాస్ కాస్త వివరంగా చెప్పేయరాదు"

"ఎందుకు?"

"నేరస్థుల వ్రేలిముద్రల్లా నీ ఒంటిమీద నా పెదవుల ముద్రలు ఎక్కడున్నాయో చెక్ చేయడానికి".

నవ్వేసింది.

"చెక్‌చేసి ఏం చేస్తావు?"

"ఐ.పి.సి లో ఏ సెక్షన్ ప్రకారం నేను నేరస్తుడ్నో వెరిఫై చేసుకుని ఆ తర్వాత నువ్వు కస్టడీలోకి తీసుకుంటే అక్కడా శిక్ష అనుభవించేద్దామని..."

"అబ్బ....ఆశ-"

"అయితే వీల్లేదంటావు."

"ఆహా."

"అయితే ఈసారి కల్లోకొచ్చి...."

"వచ్చి...."

"సెక్షన్ 375 తెలుసుగా...."